ఆంధ్రప్రభ - అక్టోబర్ 20, 1995

"శ్రీకృష్ణ భగవానుడు గీతలో జ్ఞానాన్ని ఇమిడ్చాడు.
మరి గీతల్లో పాప హోం వర్కు ఇమడదా?"

# పాప - హోంవర్కు

అనగా అనగా ఒక పాప.

ఆ పాపకు అయిదేళ్ళు. అయినా అప్పుడే మూడేళ్ళ నుంచి బడికి వెడుతూ ఇప్పుడు ఒకటో క్లాసు చదువుతోంది.

ఒకరోజు పాప బడినుంచి ఇంటికొచ్చింది. నాన్నకు జ్వారం. అమ్మ, బామ్మ కంగారు పడుతున్నారు. పాప కూడా కంగారుపడి, "మమ్మీ! నా హోంవర్కు ఎవరు చేస్తారు?" అంది.

అప్పుడు పాప తల్లికి హోంవర్కు గురించి గుర్తుకొచ్చింది. భర్తకు మందులిచ్చి పాప పుస్తకాలు తీసుకుంది.

ఆమె బియ్యే పాసయింది. కానీ అంతవరకూ భర్త చూసుకున్నాడు కదా అని పాప పుస్తకాలెప్పుడూ చూడలేదు. ఒకటో క్లాసే అని తేలికగా తీసుకుంది కానీ ఆ పుస్తకాలు ఆమె బియ్యే చదువుకు కొరుకుడు పడలేదు. ఆ విషయం పాప ముందొప్పుకోవడం ఇష్టం లేక, "నాకు చాలా పనులమ్మా, తీరుబడి లేదు. పక్కింటి అంకుల్నడుగు" అంది.

పాప వెళ్ళేసరికి పక్కింటి అంకుల్ వాళ్ళబ్బాయి నర్సరీ హోంవర్కు చూస్తున్నాడు. ఆయన పాప పుస్తకాలు చూసి, "నాకు మా అబ్బాయితోనే తీరుబడి చాలడంలేదు. నీకెక్కడ చెప్పేది? ఎదురింట్లో నిరుద్యోగి కుర్రాడున్నాడు. అతడిని అడుగు" అన్నాడు.

పాప నిరుద్యోగి కుర్రాడిని అడిగింది. వాడు పాప పుస్తకాలు చూశాడు. తను చదువుకున్నప్పటి పాఠాలేవీ అందులో కనిపించలేదు. ఓ క్షణం ఆలోచించి, "పాపా నాకైతే రేపు ఇంటర్వ్యూ వుంది. ఇంతకంటే పెద్ద పుస్తకాలు ఈ రాత్రంతా చదవాలి. పక్కింట్లో ఓ అమ్మాయి టీచరు ట్రయినింగ్ అవుతోంది. ఆమెనడుగు" అంటూ సగం అబద్ధం, సగం నిజం కలిపి చెప్పి పంపేశాడు.

టీచరు ట్రయినింగమ్మాయి వద్దకు వెళ్ళింది పాప. ఆ అమ్మాయి పాప పుస్తకాలను శ్రద్ధగా పరీక్షించి, "నా ట్రయినింగ్ నర్సరీ క్లాసుకి. ఒకటో క్లాసుకి ట్రయినింగవుతున్న నా స్నేహితురాలు పక్క సందులో వుంది" అని చెప్పింది.

పాప పక్కసందులోకి వెడితే ఆ అమ్మాయికి పాప పుస్తకాలు చూసేక కడుపులో పోట్లొచ్చాయి. అంతలో అమ్మాయి చిట్టి తమ్ముడలా వచ్చాడు. రెండో క్లాసు చదువుతున్న వాడు పాప పుస్తకాలు లాక్కొని, "ఓస్ ఈ హోంవర్కు కూడా కష్టమేనా? నేచేసి పెడతానుండు" అంటూ అన్నింట్లోనూ పిచ్చిగీతలు గీసిపారేశాడు.

"నా తమ్ముడు బుద్ధిమంతుడు. ఇలా ఎందుకు చేశాడు?" అని ఆమె అంటే, "ఇప్పుడు మాత్రం నా బుద్ధికి తక్కువేముంది?" అంటూ చిట్టి తమ్ముడు ఎదురు ప్రశ్న వేశాడు.

పాపకు మాత్రం దుఃఖం వచ్చి ఏడుస్తూ ఇంటికెళ్ళి తల్లికి జరిగింది చెప్పింది. తల్లి పాపను ఓదార్చి "టీచరు నిన్నేమీ చేయకుండా ఉత్తరం రాసిస్తాన్లే" అంది.

తల్లి వ్రాసిన ఉత్తరంతో మర్నాడు పాప బడికి వెళ్ళింది.

టీచరు క్లాసుకి వచ్చి ఒకొక్కర్నీ హోంవర్కు గురించి అడుగుతోంది. అందరూ పుస్తకాలు చూపిస్తున్నారు. ఒక పుస్తకంలో కాళీ వుంది. టీచరు ఆ కుర్రాడివంక కోపంగా చూసింది. ఆ కుర్రాడు టీచరుకో ఉత్తరం అందించాడు. నిన్న రాత్రంతా ఆ కుర్రాడికి కడుపులో పోట్లు వచ్చి అన్నం కూడా తినలేదని ఆ కుర్రాడి తల్లి ఉత్తరంలో వ్రాసింది.

"ఇలాంటి ఉత్తరాలు నేను నమ్మను. బోలెడు ఫీజు కట్టి ఇందులో చదువుతున్నారు మీరు. క్రమశిక్షణ పాటిస్తూ, ఏరోజు పని ఆరోజు చేయకపోతే మీరిక్కడ్నుంచి ఏం నేర్చుకున్నట్లు? హోం వర్కు రోజూ మీరు చేయాలి. జ్వరం వచ్చి మంచం మీదున్నా సరే హోంవర్కు మాత్రం చేసి పుస్తకాలు నాకు పంపాలి. అలా మీరు చేసేలా చూడడం నా బాధ్యత. ఇంకెప్పుడూ ఇలాంటి ఉత్తరాలు తీసుకురాకండి." అంటూ ఆ కుర్రాడ్ని చావబాది మిగిలిన పిల్లలందర్నీ హెచ్చరించింది. కుర్రాడు ఏడుస్తూ వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

పాపకు గుండెలవిసిపోయాయి. భయపడుతూనే టీచరు వద్దకు వెళ్ళింది తన వంతురాగానే! వణికిపోతూ హోం వర్కు పుస్తకాలు చూపించింది.

టీచరు మొదటి పుస్తకంవైపు శ్రద్ధగా చూసింది. పిచ్చి గీతలన్నీ అయ్యాక చివర వెరీగుడ్ అని వ్రాసి సంతకం పెట్టింది. అలాగే ప్రతి నోట్‌బుక్‌లోనూ చేసింది.

పాప ఆశ్చర్యానికి అంతులేదు.

అందరి పుస్తకాలూ చూడడమయ్యాక టీచరు తన పర్సు తీసింది. అందులోంచీ కళ్ళజోడు తీసింది. ఓ సారి తుడిచి కళ్ళకు పెట్టుకుంది. అప్పుడు పాఠం చెప్పడానికి పుస్తకం తీసింది.

పాప తన పక్కనే కూర్చున్న కుర్రవాడికీ విషయం చెప్పింది.

వాడు జ్ఞానిలా నవ్వి, "ఈ విషయం నాకెప్పుడో తెలుసు" అన్నాడు.

అదెలాగా అని పాప ఆశ్చర్యపడింది కానీ టీచరు సైలెన్సు అనడంతో విషయం తెలుసుకుందుకు క్లాసయ్యేదాకా ఆగాల్సి వచ్చింది.

అప్పుడా కుర్రాడు పాపకు తనకు తెలిసింది చెప్పాడు, "మా నాన్న మీనాన్నకంటే తక్కువ చదువుకున్నాడుగా - అందుకని ఏడాదిక్రితం నా క్లాస్ హోంవర్కుకే ఆయనకు జ్వరం వచ్చింది. మన మేడమ్స్ అందరూ కళ్ళజోళ్ళవాళ్ళేకదా! వాళ్ళు కాగితం నలుపైతే చాలు. సంతకం పెట్టేద్దామని - హోం వర్కు చూసేటప్పుడు కళ్ళజోళ్ళు పెట్టుకోరు. ఆ ట్రెయినంగమ్మాయి చిట్టి తమ్ముడు బుద్ధిమంతుడు. అల్లరి పిల్లాడు కాదు. అన్నీ తెలిసే నీకు సాయం చేశాడు".

పాపకప్పుడు కలిగిన ఆనందం వర్ణనాతీతం. ఆరోజు ఇంటికి వెళ్ళగానే అందరికీ జరిగినదంతా చెప్పింది.

అప్పుడు పాప తండ్రి చటుక్కున మంచం మీంచి ఉరికి, "అయ్యో! ఈ విషయం తెలియక అనవసరంగా జ్వరపడ్డానే" అని బాధపడ్డాడు. ఆ తర్వాత ఆయనిక ఏ మందూ వేసుకోలేదు. రాత్రి పాపతో కలిసి ఏ పథ్యమూ లేకుండా భోంచేసాడు.

హోంవర్కు భయం పోవడంతో పాప హాయిగా చదువును కొనసాగిస్తోంది. పక్కింటంకులు, ఎదురింటి నిరుద్యోగి, ఆ పక్కింటి టీచరు ట్రయినింగమ్మాయి, ఆమె స్నేహితురాలు అందరూ పాపతో అభిమానంగా, సరదాగా వుంటున్నారు. వాళ్ళకూ ఏ ఇబ్బందులూ - జబ్బులూ రావడం లేదు.

ఈ కథ చదివినవారికీ, విన్నవారికీ - ఇంట్లో చిన్న చదువులు చదివే పిల్లలున్నప్పటికీ - ఏ ఇబ్బందులూ, వ్యాధి పీడలూ ఉండవు.

మంగళం మహత్ శ్రీశ్రీశ్రీ....

✦ ✦ ✦